క్లుప్తంగా

అధ్వాన రహదారితో ఇబ్బందులు



సిల్వర్ జూబ్లీ కళాశాల వద్ద నెర్రెలిచ్చిన రోడ్డు

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని బి.క్యాంపు నుంచి దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ రోడ్డు మధ్యలో నెర్రెలివ్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు

కర్నూలు(హాస్పిటల్): లయన్స్ క్లబ్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ గవర్నర్ వై. నాగేశ్వరరావు చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కర్నూలులోని చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు, కుట్టుమిషన్ శిక్షణ, మెడికల్ క్యాంపులు, అనాథ ఆశ్రమాలకు సరుకుల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణం చేసి బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్. భరత్‌కుమార్ జైన్, టీవీ రత్నప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఐ. విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు బహుమతుల అందజేత



ప్రతిభావంతులతో సమాఖ్య ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: రాయల్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో వంటల పోటీల్లో విజేతలకు, పదోతరగతి, ఇంటర్మీడియట్ మెరిట్ విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. సమాఖ్య ప్రతినిధులు సుజాత, బ్రాహ్మణి, సుధా, వర్షిని, ఆదిలక్ష్మి, భారతి, సవిత, సరస్వతి, విజయపాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యులతో మానవత సభ్యులు

కర్నూలు కల్చరల్: మానవత మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మహిళా విభాగం కన్వీనర్ యాని ప్రతాప్ మాట్లాడుతూ మానవ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కిమ్స్ ఆస్పత్రి వైద్యులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మానవత సభ్యులు మనోహర్‌రెడ్డి, యుగంధర్ శెట్టి, అపర్ణ, దీప, శివారెడ్డి, శశిధర్, పాటిల్ హనుమంతరెడ్డి, పద్మ, సుభద్రమ్మ, శ్రీలీల, లక్ష్మి, కార్తీక, మంజుల, రాజు, సునీల్, సరేష్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయిలో తైక్వాండో క్రీడాకారులు ప్రతిభ చాటాలని టీడీపీ దళిత జేసీఏ చైర్మన్ రామక్రిష్ణ అన్నారు. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న పార్కులో తైక్వాండో సాధన చేస్తున్న క్రీడాకారులకు బెల్టు పోటీలు నిర్వహించి పతకాలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

అలరించిన 'భూతకాలం' నాటకం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



నాటకంలో అలరించిన సన్నివేశాలు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం ప్రదర్శించిన 'భూతకాలం' సాంఘిక నాటకం ఆహుతులను అలరించింది. నాటకంలో ప్రధాన పాత్రల్లో మంజునాథ, నిఖిలేష్, సురభి కుమారి, అనూష కుమారి, దివ్యతో పాటు 15 మంది కళాకారులు చక్కని లైటింగ్ సెట్టింగ్‌లతో ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ జి.వి.మోహన్‌కుమార్ జ్యోతి ప్రజ్వలనతో నాటక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాటకాన్ని ఇంజినీరింగ్ విద్యార్థులు తప్పకుండా చూడాలన్నారు. తమ కళాశాలలో ఈ నాటక ప్రదర్శనను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు సెల్‌ఫోన్ జీవితంలో ఒక భాగమైందన్నారు. అందులో నుంచి బయట పడాలన్నారు. నాటక దర్శకులు గోవాడ వెంకట్ మాట్లాడుతూ కర్నూలులో ప్రేక్షకుల ఆదరణ బాగుందన్నారు. భూతకాలం నాటకాన్ని కర్నూలుకు చెందిన ఎం.దివాకర్ బాబు రచించారన్నారు. ఈయన సినీ రచయిత అన్నారు. అనంతరం కళాకారులను అతిథులు సన్మానించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సీనియర్ కళాకారులు హెచ్.చంద్రన్న, రమణారెడ్డి, కన్వీనర్లు యాగంటీశ్వరప్ప, గాండ్ల లక్ష్మన్న పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన కల్పించాలి



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర



హరినామ సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: భగవద్గీతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరు భగవద్గీత గురించి తెలుసుకోవాలని పఠనం, శ్రవణం చేయాలని నరసరావు పేట ఇస్కాన్ ప్రవచకులు శ్రీనివాస్ అన్నారు. స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల గురించి భారత, రామాయణ, ఇతిహాసాల్లో ఉన్నాయని వాటిని విద్యార్థులకు వివరించాలన్నారు. అనంతరం హరే కృష్ణ హరే రామ జప యజ్ఞం నిర్వహించారు. హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు.. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి



మాట్లాడుతున్న కె.బాబురావు

కర్నూలు(సెంట్రల్) : రైతులకు వెంటనే పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు మేలు చేయడానికి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పెట్టుబడి సాయంగా విత్తన సమయంలో కేవలం రూ.2 వేలే ఇవ్వడం అన్యాయమన్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డీసీసీ గౌరవాధ్యక్షుడు వెంకటన్న, డీసీసీ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం, డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్ పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యులకు సన్మానం



డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న ఆయుష్ విభాగం వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకరరెడ్డి (ఆయుర్వేదం), డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి (హోమియో) పదవీ విరమణను పురస్కరించుకుని ఆదివారం ఘనంగా సన్మానించారు. గుత్తిరోడ్డులోని లావాస్టోన్‌లో ఆయుష్ విభాగం వైద్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సదరు వైద్యుల ఆయుష్‌కు అందించిన వైద్యసేవలను వక్తలు కొనియాడారు. ఆయుష్ విభాగంలో వారు ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఆర్ కాలేజీ అధినేత పలుకూరి వెంకట్రామిరెడ్డి, ఆయుష్ వైద్యులు నాగేశ్వరబాబు, నాగరాజు పాల, పద్మనాభరెడ్డి, రమేష్, నారపురెడ్డి, ఎస్‌వీఎల్ఎన్ ప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



సమావేశంలో మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): నగరంలోని వీధుల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన పాతబస్తీ సీపీఎం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎవరైనా ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. నగరంలోని ఎర్రబురుజులో నాలుగు నెలలుగా మ్యాన్‌హోళ్లు తెరచి ఉండడంతో ప్రమాదాలు నిత్యం చోటు చేసుకుంటున్నాయన్నారు. కొండారెడ్డి బురుజు సమీపంలోని సర్కిల్ పనులు నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందిగా మారిందన్నారు. సలాంఖాన్ సర్కిల్, పెద్దపార్కు సమీపాల్లోనూ కొన్ని పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం మధ్యలో వదిలి వేసిన పనులను ఈ ప్రభుత్వం త్వరగా చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, అబ్దుల్‌దేశాయ్ పాల్గొన్నారు.

రిటైర్డ్ వర్క్ ఇన్‌స్పెక్టర్, లస్కర్లకు సన్మానం



రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది

కోడుమూరు రూరల్ : గాజులదిన్నె ప్రాజెక్టు కోడుమూరు సబ్ డివిజన్‌లో వర్క్ ఇన్‌స్పెక్టర్, లస్కర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఆంజనేయులు, సాయరామన్నను ఆదివారం స్థానిక ఎల్ఎల్‌సీ కార్యాలయ ఆవరణలో అధికారులు, సిబ్బంది పూలమాల, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ ఆంజనేయులు, సాయరామన్న తమ పదవీ కాలంలో రైతులకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఎల్ఎల్‌సీ ఆదోని డివిజన్ ఈఈ శైలేశ్వరరెడ్డి, ఇరిగేషన్ డీఈఈలు విజయ్ కుమార్, లక్ష్మణ్‌కుమార్, షఫీబాషా, ఏఈలు పరమేష్, నారాయణ, చిన్న హోలీ, మోహన్‌రావు, లక్ష్మన్న, సూర్యప్రకాష్, మణికంఠ, ఉదయభాస్కర్, రామాంజనేయులు, రవిప్రసాద్, ఏపీ ఇరిగేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామేశ్వరరెడ్డి, ఆదోని బ్రాంచ్ అధ్యక్షుడు కిష్టప్ప పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

ఓర్వకల్లు : మండల రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కోరారు. ఆదివారం ఆయనతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, సీఐటీయూ మండల కార్యదర్శి మధు, మండల నాయకులు శ్రీధర్, రైతు సంఘం మండల కార్యదర్శి చంద్రబాబు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ.. మండలంలో ప్రధానంగా సాగు, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. మండలంలో అధిక శాతం రైతులు వర్షాధారం కింద వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు. సమస్య పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని విన్నవించారు. రైతుల పంటపొలాల్లో జింకల బెడద ఎక్కువగా వుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, సంబంధిత అధికారులతో చర్చించి పంటపొలాలు కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు షాజహాన్, చాంద్‌బాషా, సూర్యనారాయణ, నాగమ్మ, సావిత్రమ్మ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

ఓర్వకల్లు: ఈ నెల 2వ తేదీన బాలభారతి పాఠశాలలో నిర్వహించనున్న రజితోత్సవ వేడకలను జయప్రదం చేయాలని సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో మండల మహిళా సమాఖ్యను స్థాపించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ఈ నెల 2వ తేదీన బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్న కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గౌరు చరిత దంపతులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కావున మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, పొదుపు మహిళలు, వెలుగు సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

4న మండల సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు : ఈ నెల 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మల్లీశ్వరి తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం కొలువైన తర్వాత మొదటి సమావేశం కావడంతో వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమాశానికి వివిధ శాఖల ద్వారా గత మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరుకానుండడంతో ప్రగతి నివేదికలతో ఆయా శాఖల అధికారులు మాత్రమే హాజరుకావాలని, కింది స్థాయి సిబ్బందిని పంపకూడదని స్పష్టం చేశారు.

సబ్ ప్లాన్ చట్టానికి నిధులు కేటాయించాలి

కౌతాళం: ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టానికి దళిత గిరిజనుల జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించి పకడ్బందీగా అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో ఆదివారం కౌతాళం మండల జనరల్ బాడీ సమావేశం కేవీపీఎస్ మండల ఉపాధ్యక్షుడు వీరేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆనందబాబు, జిల్లా సహాయ కార్యదర్శి చిన్న మారయ్య మాట్లాడుతూ.. తరాలు మారుతున్నా దళితుల తలరాతలు మాత్రం మారడం లేదని, దీనికి కారణం దళితులను అణిచిఉంచిన నాటి మనువాద భావజాలం నేటికి కొనసాగడమే అన్నారు. సామాజిక స్థితిగతులు మారాలంటే జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఖర్చు చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. నూతన ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. చట్టాన్ని పాలకులు అమలు చేసేలా గ్రామ గ్రామాన సంఘాన్ని నిర్మించి కార్యకర్తలంతా ఉద్యమించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు రామకోటి, హనుమంతు, మండల కార్యదర్శి తాయప్ప, జయరాం, ఆదాం, శ్రీరాములు, తిక్కయ్యలు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయాలి

కోడుమూరు రూరల్: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా ఈనెల 1వతేదీ ఉదయం 6గంటల నుంచే గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి లబ్ధిదారుడి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేయాలని ఎంపీడీఓ దివ్య ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 9,106 మంది పింఛనుదారులుండగా, రూ.6,21,96,500 మంజూరయ్యాయని చెప్పారు. సోమవారం సాయంత్రంలోగా లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ పూర్తి చేయాలని, పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి

సి.బెళగల్ : ఈ నెల 1న రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఉద్యోగులు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ శకుంతల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామన్నారు.

కేసీ కెనాల్‌కు 256 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు 256 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆదివారం డ్యాం జేఈ రాజు తెలిపారు. రిజర్వాయర్‌కు ఎగువ నుంచి 720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా దిగువకు ఒక గేటును తెరచి 456 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 256 క్యూసెక్కులు విడుదల చేశామని, ప్రస్తుతం రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీరుందని చెప్పారు.

ఆదోనిలో రైలును నిలపాలి

ఆదోని అర్బన్: డివిజన్ కేంద్రం ఆదోని మీదుగా ప్రతి గురువారం యశ్వంత్‌పూర్ నుంచి జైపూర్‌కు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు (రైలు నంబర్ 82654) వెళ్తోందని, ఆ రైలుకు ఆదోనిలో స్టాపింగ్ కేటాయించేలా రైల్వే బోర్డు అధికారులతో మాట్లాడాలని ముస్లిం, మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. రాజస్థాన్‌లో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, జైన దేవాలయాలు, హజరత్ ఖ్వాజాగరీబ్ నవాజ్ దర్గాలు ఉన్నాయని, వాటిని దర్శించుకునేందుకు ముస్లింలు, జైనులు, వివిధ వ్యాపారాల నిమిత్తం ఆదోని ప్రాంతం నుంచి అన్ని వర్గాల ప్రజలు జైపూర్‌కు వెళ్తుంటారని అధికారులు స్పందించి ఆదోనిలో స్టాపింగ్ ఇవ్వాలని కోరారు.

రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్లు హర్షవర్ధన్, ఉదయ్‌కుమార్



చాంపియన్లుగా నిలిచిన వారితో నిర్వాహకులు

కర్నూలు (టౌన్): 4 వ స్పార్క్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ చాంపియన్లుగా హర్షవర్ధన్ ఆచారి (నంద్యాల), రన్నరప్‌గా ఉదయ్‌కుమార్ నాయుడు (అనంతపురం) నిలిచారు. ఆదివారం స్థానిక అచల అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహించారు. స్విస్ లీగ్ పద్ధతిలో మొత్తం ఆరు రౌండ్ల పోటీలు నిర్వహించారు. మూడో స్థానంలో హర్షిత్ (కర్నూలు) నిలిచారు. ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన 24 మంది విజేతలు వచ్చే నెల 12, 13, 14 తేదీల్లో విజయవాడలో జరిగే చెస్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఆల్ కర్నూలు అసోసియేషన్ నిర్వాహకులు నందకిషోర్ వెల్లడించారు.



ఫైర్ స్టేషన్ సమీపంలోని వంక వద్ద కోతకు గురైన రోడ్డు

పొంచి ఉన్న ప్రమాదం

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి వెల్దుర్తి వెళ్లే రహదారిలో వాహనదారులకు పలు చోట్ల ప్రమాదాలు పొంచివున్నాయి. గతంలో కురిసిన భారీ వర్షాలకు వాగులు,వంకలు పొంగిపొర్లినప్పుడు కల్వర్టులు, వంతెనల వద్ద భారీగా రోడ్డు కోతకు గురైంది. అయితే సంబంధిత అధికారులు మాత్రం దెబ్బతిన్న రోడ్లు, కోతకు గురైన రోడ్లకు ఇంతవరకు కనీస మరమ్మతులు చేపట్టలేదు. వాహనదారులు అదమరిచి ప్రయాణిస్తే ప్రమాదాల భారిన పడే అవకాశముంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో, వర్షాలు పడుతున్న సమయంలో వాహనదారులు రోడ్డుపక్కకు వెళ్తే ప్రమాదం చోటు చేసుకోవచ్చు.



కోడుమూరు-వెల్దుర్తి రోడ్డులో కల్వర్టుల వద్ద దెబ్బతిన్న రోడ్డు

దివ్య ఔషధం నేరేడు



కోసిగిలో నేరేడు పండ్లను విక్రయిస్తున్న వ్యాపారి

కోసిగి: నల్లటి నేరేడు పండ్లను చూస్తే చాలు నోరూరుతుంది. దివ్య ఔషధంగా నేరుగా పండ్లు ఉపయోగపడుతుంటాయి. ఆ పండ్లు కోసిగి మండలంలో బాగానే లభ్యమౌతున్నాయి. ఏటా వర్షాలు పడిన వారానికే చెట్ల నుంచి పండ్లు రాలి కిందకు పడుతుంటాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి నెలరోజుల పాటు ఈ పండ్లు ముమ్మరంగా లభిస్తుంటాయి. కోసిగి మండలంలో రైతుల పొలాల్లో 400 నుంచి 500 దాకా నేరేడు చెట్లు ఉన్నాయి. రోజుకు వెయ్యి కేజీల దాకా పండ్లు లభిస్తాయి. కొందరు రైతులు పండ్లను నేరుగా విక్రయిస్తుండగా, మరికొందరు రైతులు చెట్లను లీజుకు ఇస్తారు. రోజు వేకువజామున 4 గంటలకల్లా చెట్టు దగ్గరకు వెళ్లి పండ్లను రాల్చి ఏరుకుని 6 గంటల్లోగా ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్దకు చేరుకుంటున్నారు. అక్కడ కొనుగోలుదారులకు, వ్యాపారస్తులకు చేరు (కేజీ) రూ.50 నుంచి రూ.60 ప్రకారం విక్రయిస్తారు. చిరు వ్యాపారస్తులు వాటిని గంపలలో వేసుకుని రైళ్లలో, బస్సులలో ఇతర పట్టణాలకు తరలించి అమ్మకాలు చేపడుతుంటారు.

దేవరగట్టులో ముగిసిన వరుణయాగ పూజలు



పూర్ణాహుతి పూజలు



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

హొళగుంద: దేవరగట్టు శ్రీమాళ మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఈ నెల 28వ తేదీ నుంచి జరుగుతున్న వరుణయాగ పూజలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఎల్లెల్సీ సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మతగేరి తప్పెట రామిరెడ్డి, సమ్మతగేరి సర్పంచ్ శోభా దంపతుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. టీబీ బోర్డు ఉన్నతాధికారులు, ఎల్లెల్సీ ఎస్డీఓలు, ఆంధ్రా, కర్ణాటక సెక్షన్ ఆఫీసర్లు, రైతు సంఘం నాయకులు, దేవరగట్టు ఆలయ కమిటీ సభ్యులు, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామపెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి అందరూ సుభిక్షంగా ఉండాలని ఈ పూజలు చేసినట్లు నిర్వాహకుడు తప్పెట రామిరెడ్డి తెలిపారు. భక్తులకు అన్నదాన, తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.